ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు


వైద్యులతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా ఆధ్వర్యంలో వైద్య బృందం ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ మజహరుల్లా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనుల జాబితాను ఆయనకు అందించారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే పూర్తి వివరాలు అందిస్తామని ఆయన అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి నిధులు అవసరమని తాను అసెంబ్లీలో ప్రశ్నలెవనెత్తానని దీనిపై అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు స్పందించి ఆసుపత్రి అభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించారని అన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్, ఏఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు తదిదతరులున్నారు.

పాతబస్తీ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ కృషి

యాకుత్‌పురా: పాతబస్తీ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. యాకుత్‌పురా రెయిన్ బజార్‌లో రూ.2.45 కోట్ల ఎంపీ అభివృద్ధి నిధులతో చేపట్టానున్న సివరేజ్ పైప్‌లైన్ పనులకు బుధవారం ఆయన యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టానున్నామన్నారు. యాకుత్‌పురాలో నాలాలా విస్తరణ, అభివృద్ధి పనులతో పాటు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్, తలాబ్ చంచలం, పత్తర్‌గట్టి డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనాబగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మాజీ కార్పొరేటర్లు, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేసిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్


ఎంపీ, ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న రాజేశ్వర్ వర్మ తదితరులు

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ..

చార్మినార్: పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో ఎంపీ లాడ్స్ నిధులతో పలు అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తమ పార్టీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. బహదూర్‌పురా నియోజక వర్గంలోని దూద్‌బౌలి, కిషన్‌బాగ్, రాంనాస్‌పురా తదితర డివిజన్లలోని పలు బస్తీల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో కలిసి ప్రారంభించారు. స్థానిక బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎంపీ లాడ్స్ నిధులతో పాతబస్తీలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేశ్వర్ వర్మ, దీపేష్ రాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

చార్మినార్: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని చార్మినార్ ఏసీపీ సుదర్శన్ అన్నారు. చార్మినార్ ఏసీపీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సుదర్శన్‌ను చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తన ఎస్సైలతో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పని చేసిన రుద్రభాస్కర్ సిటీ సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత బస్తీలోని దక్షిణ మండలంలో చార్మినార్ ఏసీపీ పరిధి ఎంతో కీలకమైందని.. ప్రపంచ పర్యాటక కేంద్రాలు కూడా దాదాపు తమ ఏసీపీ పరిధిలోనే ఉన్నాయన్నారు. స్థానిక ప్రాంతాల ప్రజలతో పాటు పర్యాటకులకు కూడా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.


ఏసీపీకి బొకే అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైలు

భారతీయ సంస్కృతికి సంస్కృతం ప్రతిబింబం


నీలకంఠానికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రాచీన కాలం నుంచి సంస్కృత భాష మన సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిందని సంస్కృత అకాడమీ సంచాలకులు ఆచార్య కాశొజ్జుల నీలకంఠం అన్నారు. బుధవారం సాయంత్రం బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నీలకంఠంకు విద్యాలంకర ముదిగంటి గోపాల్‌రెడ్డి పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ పురస్కారాన్ని పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య శ్రీపాద సుబ్రమణ్యం, ముదిగంటి సుజాత రెడ్డి చేతుల మీదుగా రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధునిక కాలంలో సంస్కృత భాష ప్రాధాన్యంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో తప్పిపోయి.. తమిళనాడులో గుర్తింపు

కుటుంబ సభ్యులు లేకపోవడంతో హోమ్‌కు తరలింపు

గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతూ తప్పిపోయిన బాలికను భవానీనగర్ పోలీసులు తమిళనాడు చైన్నై సిటీలో గుర్తించి ఆమెకు ఎవరూ లేకపోవడంతో బన్సీలాల్‌పేట్‌లోని హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ కూతురు ఆస్పియా బేగం (17) గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు ఆస్పియా బేగంను గొలుసుతో కట్టేసి ఉంచుతూ ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్సలు సైతం అందిస్తున్నారు. గతేడాది అక్టోబర్ 12న జుబేర్ పని నిమిత్తం బయటికి వెళ్లగా ఆస్పియా బేగం గొలుసును తెంచుకొని ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తప్పిపోవడంతో గతేడాది డిసెంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా తమిళనాడు చైన్నై సిటీ కిల్పాక్ విలేజ్ బాల విహర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం అక్కడికి వెళ్లింది. ఆస్పియా బేగంను నగరంలోని తండ్రికి వీడియో కాల్ చేసి మాట్లాడించారు. ఆ తర్వాత రెండ్రోజుల్లో తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆస్పియా బేగంను బుధవారం నగరానికి తీసుకొచ్చి నింబోలిఅడ్డాలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో హాజరు పర్చగా వారు బన్సీలాల్‌పేట్‌లోని హోమ్‌కు తరలించాలని సూచించడంతో హోమ్ సభ్యులకు అప్పగించారు.

అప్పు చెల్లించలేదని యువకుడిపై కత్తులతో దాడి

అబిడ్స్: తీసుకున్న అప్పు చెల్లించలేదని యువకుడిపై పాతమిత్రులు కత్తులతో దాడి చేసిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాబౌలిలో చోటు చేసుకుంది. నిఖిల్, లడ్డూ అలియాస్ వినోద్‌గౌడ్, ఆకాశ్, దీపక్ సింగ్ పాతమిత్రులు. నిఖిల్ కొన్ని నెలల క్రితమే లడ్డూ అలియాస్ వినోద్‌గౌడ్ దగ్గర రూ.80 వేల అప్పుగా తీసుకున్నాడు.. రూ.60 వేలు తిరిగి లడ్డూకు ఇచ్చాడు. మిగతా రూ.20 వేలు ఇవ్వాలని లడ్డూ కొన్ని రోజులుగా నిఖిల్‌ను వేధిస్తున్నాడు. బుధవారం గంగాబౌలి దగ్గరకు నిఖిల్‌ను పిలిపించి లడ్డూ, ఆకాష్, దీపక్ డబ్బుల విషయంలో వాగ్వాదానికి దిగారు. కోపంతో లడ్డూ నిఖిల్‌పై కత్తితో దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన నిఖిల్‌ను మంగళ్‌హాట్ పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దాడిచేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శాతం చెరువు దశ మారేదెన్నడో..?

- అధ్వానంగా శాతం చెరువు
- దశాబ్దాలు గడుస్తున్నా కానరాని అభివృద్ధి
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


ధ్వంసమైన శాతం చెరువు ఫెన్సింగ్

గోల్కొండ: దశాబ్దాలు గడుస్తున్నా గోల్కొండ నయాఖిలాలోని శాతం చెరువు దశ మారడం లేదు. అధికారులు, మంత్రులు శాతం చెరువును సందర్శించి దీనిని అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇచ్చి వెళ్తున్నారు కానీ ఇప్పటి వరకు చెరువు అభివృద్ధికి చేపట్టిన చర్యలు శూన్యం అనే చెప్పాలి. కేవలం వర్షాకాలంలో శాతంచెరువు నిండినప్పుడే అధికారులు హంగామా చేస్తూ హడావిడిగా చెరువులో పూడిక తీత పనులు చేపడుతున్నారు. గోల్కొండ కోట నయాఖిలా ప్రహరీని ఆనుకొని ఉన్న కందకం కింద భాగంలో శాతం చెరువు ఉంది. కాల క్రమంలో ఈ చెరువును ఆనుకొని నదీమ్ కాలనీతో పాటు ఇతర కాలనీలు వెలిశాయి. వర్షాకాలంలో ఈ చెరువు వరద నీటితో నిండు కుండలా మారుతుంది. దీంతో ఈ చెరువు బ్యాక్ వాటర్ చెరువును ఆనుకొని ఉన్న నదీమ్ కాలనీని ముంపునకు గురి చేస్తున్నాయి.

కట్ట పొడవునా వ్యర్థాల డంపింగ్..

అధికారులు కాలనీ ముంపునకు గురి కాకుండా చెరువు తూముకు మరమ్మతులు చేస్తున్నారే తప్ప చెరువు సుందరీకరణ పనులు ఏమాత్రం చేపట్టడం లేదు. అడపదడప చెరువు సుందరీకరణ పనులు ఎంతో ఆర్భాటంతో ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా దీనికి కంచె వేశారు. ఈ కంచె కూడా నాణ్యత లేకపోవడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. మరోవైపు చెరువు సుందరీకరణ అంటూ చెబుతున్న అధికారులు చెరువులో వ్యర్థాల డంపింగ్‌ను అడ్డుకోవడానికి చర్యలు చేపట్టడం లేదు. ప్రతి నిత్యం టన్నుల కొద్ది వ్యర్థాలు చెరువుతో పాటు చెరువు కట్ట పొడవునా డంపింగ్ అవుతున్నాయి. ఈ డంపింగ్ వల్ల చెరువు కుచించుకుపోతుంది. కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ఈ చెరువు పూడికతీత పనులు చేపడుతున్నారు. చెరువు అభివృద్ధికి శాతం చెరువు ఎగువ ప్రాంతంలో మట్టి వేసి నింపారు. కాగా మట్టి వేసిన అటువైపు ఉన్న జాగా మొత్తం కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉంది. ఏదేమైనా గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని తెలుగు దేశం ప్రభుత్వం నుంచి గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువును సుందరీకరించిన దాఖలాలు లేవు.

దోమల ఉత్పత్తికి కేంద్రంగా..

శాతం చెరువుకు దోమల చెరువుగా కూడా స్థానికులు పిలుస్తుంటారు. పూడికలు, దుర్గంధం వెదజల్లే ఈ చెరువు దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. బల్దియా వారి ఎంటమాలజీ విభాగం వారికి శాతం చెరువు ఆదాయ వనరుగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక సంవత్సరంలో పలు మార్లు యంత్రాలు, కూలీలను పెట్టి చెరువులో పూడికతీత పనులు చేపడుతుంటారు. అయితే ఈ పనులు ఎప్పుడు మొదలై ఎప్పుడు పూర్తి అవుతాయో ఎవరికి తెలియదు. తీసిన పూడికలు చెరువు కట్ట పక్కనే వదిలేస్తున్నారు. ఆ పూడికలు మళ్లీ చెరువులోనే కలిసిపోయే ప్రమాదం కూడా ఉంది. చెరువు తూము కింది భాగంలో ఉన్న కందకం కూడా దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఇప్పటికైనా మారిన ప్రభుత్వంతో పాటు అధికారులు చిత్తశుద్ధితో చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని శాతం చెరువు పరిసర ప్రాంతాల వారు కోరుతున్నారు.


కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు

ఆర్టీవో కార్యాలయంలో కాలిపోయిన ఆటోలు



చాంద్రాయణగుట్ట: ఆర్టీవో కార్యాలయంలో ఆటోలకు నిప్పంటుకున్న ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బండ్లగూడలోని దక్షిణ మండలం ఆర్టీవో కార్యాలయంలో సీజ్ చేసి ఉంచిన వాహనాలలో రెండు ట్రాలీ ఆటోలకు మంగళవారం రాత్రి మంటలంటుకున్నాయి. ఉదయం గమనించి అధికారులు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరైనా నిప్పు పెట్టారా? నిప్పురవ్వలు ఏర్పడి ఆటోలు కాలిపోయాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అజ్మతుల్లాకు సన్మానం




గౌలిపురా: తెలంగాణ వక్ఫ్ బోర్డు నూతన చైర్మన్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. బుధవారం నాంపల్లి హజ్ భవనంలో వక్ఫ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అజ్మతుల్లాను వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలిసిన అనిల్‌కుమార్ యాదవ్



అబిడ్స్: రాజ్యసభ ఎంపీగా నియమితులైన ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బుధవారం ఆయన రేవంత్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. చిన్న వయస్సు లో తనకు పెద్దల సభలో వెళ్లే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..రాజ్యసభలో తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సంక్షేమానికి తనవంతు పోరాటం చేస్తానన్నారు.

ఆశీర్వాదం



అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర అవోపా ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్ కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొందూరు చంద్రమోహన్, మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి ఒరుగంటి కృష్ణవేణి, వందనపు శిల్ప, అర్థం శ్రీవాణి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


అంజన్ కుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన అంజన్ కుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ బలియమైన శక్తిగా ఎదిగి ప్రజల ఆదరాభిమానాలను పొందగలిగిందన్నారు. ఆయనను కలిసిన వారిలో ఏ.చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారాల తొలగింపు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలపై అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగించారు. చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో తోపుడు బండ్లపై కొనసాగుతున్న వ్యాపారులతో చర్చించి తొలగింపు చేపట్టారు. నల్లవాగు శ్మశాన వాటిక రహదారి, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ నుంచి కేశవగిరి రహదారి, బండ్లగూడ రహదారులపై కొనసాగుతున్న పండ్లు, అల్లం వెల్లుల్లి, కూరగాయల వ్యాపారులను తీయించారు. ఈ సందర్భంగా చాంద్రాయణగుట్ట డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్ వ్యాపారులకు సర్దిచెప్పారు. రోడ్లపై వాహనాలు పార్కు చేస్తే కూడా చలాన్లు విధిస్తామని హెచ్చరించారు.


వ్యాపారులతో చర్చిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

సన్మానం




దూద్‌బౌలి: పాతబస్తీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై న ఎం.అనీల్‌కుమార్ యాదవ్ అన్నారు. గాంధీభవన్ నుంచి దూద్ బౌలిలోని తన నివాసానికి భారీ ర్యాలీతో వచ్చిన ఆయనకు పాతబస్తీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అలాగే ఆయనతో పాటు ఆయన తండ్రి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు ప్రవీన్‌కుమార్, విమలానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


మండల దేవత పూజ

నాంపల్లి: యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 8 గంటలకు మండల దేవత పూజ, ధాన్యాది, పుష్పాది, ఫలాది, శయాది వాసాలు శాస్త్రోక్తంగా జరిగాయి. 24వ తేదీ వరకు ఆలయంలో పూజాదికాలు ఉంటాయి. ఈనెల 22న ఉదయం 9 గంటలకు సుదర్శన నరసింహ హోమం, 23న చండీహోమం, 24న ఉదయం 9.37 గంటలకు గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జియాగూడ: కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్ కాలనీలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ రాజేశ్వర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పక్కనే గల పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం లభించడంతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. మృతుడు 50 ఏళ్లు పైబడి ఉండవచ్చని, మద్యం తాగి ఉన్నాడని పోలీసులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. మృతుడు గుడిమల్కాపూర్, పురానాపూల్ ప్రాంతాల్లో కూలీగా పనిచేసి ఉంటాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆహ్వానం


ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం అందజేస్తున్న మురళీకృష్ణ, దామోధర్‌గుప్తా, గోపీకృష్ణ

అబిడ్స్: స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మానేపల్లి జ్యువెలరీస్ ఎండీ మానేపల్లి మురళీకృష్ణ, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోధర్‌గుప్తా, మానేపల్లి డైరెక్టర్ గోపీకృష్ణ ఆమెకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మార్చి 6న భువనగిరి మానేపల్లి హిల్స్‌లో నూతనంగా 21 ఎకరాల్లో దాదాపు రూ.200 కోట్లతో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలకు రావాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మానేపల్లి మురళీకృష్ణ, కోలేటి దామోధర్ గుప్తా, గోపీకృష్ణ మాట్లాడుతూ..మార్చి 6న వైభవోపేతంగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ ప్రారంభోత్సవం చేస్తారని వారు తెలిపారు.

25న గరికపాటి ప్రవచనం

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర విభాగం, ఆకృతిల ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నర్సింహారావుచే ప్రవచన ప్రభంజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీల్ వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమంలో స్వీయ పరివర్తనతో విశ్వ పరివర్తన పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు తెలంగాణ జర్నలిస్టులకు కిడ్నీ అవేర్‌నెస్

గోల్కొండ: తెలంగాణ జర్నలిస్టుల కోసం గురువారం కిడ్నీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. నానల్‌నగర్ డివిజన్ టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని సాప్ కిడ్నీ సెంటర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఏ.షోయబ్‌ఏఖాన్ కిడ్నీ వ్యాధులు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడతారని తెలిపారు. ఇతర వివరాలకు 99085 31001లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరీ అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పన్నీపురా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని వైద్య సేవలను రోగులకు అందుతున్న మందుల వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు ప్రొటోకాల్‌ను కచ్చితంగా పాటించాలని ఆయన అన్నారు. వైద్యులు, నిబంధనలను పాటించని సిబ్బందిపై తాను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శోభాపాండే తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజ్మతుల్లా హుస్సేనీని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం అవసరమైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పాతబస్తీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వక్ఫ్ బోర్డు ఆస్తులున్నాయన్నారు. ఇప్పటి వరకు కబ్జాలకు గురైన వాటిని సైతం వెలికి తీసి పరిరక్షిస్తామన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందనలు



అబిడ్స్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన చైర్మన్‌గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేనికి రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు కులస్తుల రాష్ట్ర అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం జరుగుతుందన్నారు. అజ్మతుల్లా హుస్సేని ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, పోల్కం వినయ్‌రాజ్, మునిగాల రమేష్, గంగపురం దశరథ్ పాల్గొన్నారు.

హుక్కా సెంటర్ నిర్వాహకుడి రిమాండ్

సంతోష్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి హుక్కా ఫ్లేవర్స్, హుక్కా సామగ్రి, రూ.800ల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, ఎస్సై ఆర్.పద్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురా ఎంఓ కాలనీకి చెందిన యాహియా బిన్ ఖాలీద్ (23) బాలాపూర్ డైమండ్ హోటల్ వద్ద ద గెలాక్సీ కేఫ్ అండ్ లాంజ్ పేరుతో హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ హుక్కా సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా మైనర్లను అనుమతిస్తూ హుక్కా ఫ్లేవర్స్‌ను అందిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం మేరకు కంచన్‌బాగ్ ఎస్సై ఆర్.పద్మయ్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం మంగళవారం రాత్రి బాలాపూర్‌లోని హుక్కా సెంటర్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో హుక్కా సెంటర్ నిర్వాహకుడు యాహియా బిన్ ఖాలీద్ పొగాకు తాగడం ఆరోగ్యానికి హానికరం.. మైనర్లకు అనుమతించబడదు..కస్టమర్ల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులను తీసుకోకుండా..చీకటి గదుల్లో హుక్కా సెంటర్‌ను నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్నాడు. అనంతరం పోలీసులు హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ గౌస్, మహ్మద్ అజ్హర్ ఖాన్‌ల సమక్షంలో పంచనామా నిర్వహించి యాహియాను అరెస్ట్ చేసి హుక్కా సామగ్రి, హుక్కా ఫ్లేవర్స్‌ను స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు.